


"హలో రేఖా!" చిరునవ్వు అధరాలపై అందంగా మెరుస్తూండగా లోపలికి అడుగు పెట్టింది శ్రుతి. సోఫాలో పడుకున్న రేఖ కళ్ళచుట్టూ నల్లటి వలయాలు. పసిమిరంగు శరీరం వన్నె తరిగినట్లుగా వుంది. చురుగ్గా, ఉత్సాహంగా వుండే చూపులు నిర్లిప్తంగా, స్తబ్ధంగా వున్నాయి.

"సారీ మేడమ్! మీకసలే తీరికుండదని తెలిసీ ఇంటికి రప్పించాను. పైకిలేస్తే కళ్లు తిరుగుతున్నాయి. అక్కడి దాకా రాలేక."

"ఇటాల్ రైట్" రేఖ పల్స్ గమనిస్తూ అంది శ్రుతి.

"తీవ్రమైన అలసట, నీరసం తప్ప మరేం కనిపించడంలేదు. ఎనీవే, రేపోసారి హాస్పిటల్‌కి రా. బ్లడ్, యూరిన్ - అన్నీ టెస్ట్ చేయిద్దాం" రేఖకు ఇంజక్షన్ చేస్తూ చెప్పింది శ్రుతి.

"అలాగే మేడమ్. అప్పుడే ఇరవై రోజులనుంచి మీ దగ్గరకు రావాలని ప్రయత్నం. కాని తీరడం లేదు."

షోకేస్‌లో అందంగా అమర్చివున్న రకరకాల బొమ్మల్ని, ఆర్ట్ పీసెస్‌ని ప్రశంసగా చూస్తూంది శ్రుతి. మంచిగృహిణిగా సమర్థురాలైన లెక్చరర్‌గా బిజీగా వుంటూ కూడా యివన్నీ తయారుచేసి, కళాత్మకంగా అమర్చే అభిరుచిని నిలుపుకోవడం సంతోషం కలిగించింది.

"అబ్బ! ఎంత ఓపిక నీకు? ఇవన్నీ నువ్వు చేసినవే కదూ?!"

"నేను చేసినవే. గత వైభవపు చిహ్నాలు. స్టూడెంట్‌గా వున్నప్పుడు, పెళ్ళయిన కొత్తలోనూ చేసినవి." నిట్టూర్చింది రేఖ.

అంతలో రేఖ కూతురు మనోజ్ఞ స్నానం చేసి, టవల్ చుట్టుకునివచ్చిరేఖను బట్టలు తీసివ్వమని అడిగింది. రేఖ బలవంతాన లేచి వెళ్ళి బట్టలు తీసియిచ్చింది. తిరిగొస్తూ తూలిపడిపోబోయిన రేఖను, చటుక్కున లేచి చెయ్యి ఆసరా యిచ్చి సోఫాలో పడుకోబెట్టింది శ్రుతి.

"వాట్ హాపెండ్ మమ్మీ?!" క్రికెట్ బాట్ పుచ్చుకుని పరుగెత్తుకుని వచ్చిన సందీప్ తల్లి దగ్గర ఓ క్షణం ఆగి చెస్ బోర్డ్ తీసి, మేనత్తకొడుకు సారథితో ఆడసాగాడు.

పేషెంట్ చెప్పేకథలు

"మనోజ్ఞా! అమ్మకు కొంచెం మంచి నీళ్ళు తీసుకురామ్మా!" ఫ్రాక్ హుక్స్ కూడా పెట్టుకోకుండా సోఫాలో చేరగిలబడి కామిక్స్ చదువుకుంటున్న పదేళ్ల మనోజ్ఞ. పన్నెండేళ్ళ సందీప్, దాదాపు అంతే వయసున్న సారథి, ముగ్గురూ శ్రుతి చెప్పింది విన్నారు. రెండు నిమిషాలు గడిచినా ఎవరూ లేచే ప్రయత్నం చెయ్యకపోవడంతో నర్స్‌తో తెప్పించింది శ్రుతి.

"ఏమిటి మేడమ్, అంత షాకయారు? మా చిరంజీవుల్ని చూశా?" విచారంగా నవ్వింది రేఖ. మౌనంగా చూస్తూంది శ్రుతి. మనోజ్ఞ పుస్తకం సోఫాలో విసిరేసి బయటకు పరుగెత్తింది. సందీప్, సారథి ప్రపంచం తల్లక్రిందులయినా తెలియనంతటి సీరియస్‌నెస్‌తో ఆటలో నిమగ్నులయారు.

"మేడమ్! నా అనారోగ్యానికి కారణం వీళ్ళే." శ్రుతి ఆశ్చర్యం రెట్టింపయింది.

"ఫన్నీ! పిల్లలు నీ అనారోగ్యానికి కారణమా?"

"మేడమ్! నేను చెప్పేదివింటే మీకు సిల్లీగా కనిపిస్తుందేమోకూడా! నేను, ప్రసాద్ ఏంచెయ్యాలో తోచక సతమతమయిపోతున్నాం." తనూ, ప్రసాద్ ఒకరికోసం ఒకరు తపించిపోవడం, ఇద్దరికీ ఉద్యోగాలు దొరికి పెళ్ళితో తమ అనుబంధాన్ని మరీ సన్నిహితం చేసుకోవడం, కమ్మని కబుర్లతో, కలిసి పనిచేసుకోవడంతో, చిలిపి అల్లర్లతో రోజులు నిమిషాల్లా దొర్లిపోవడం, సాయం సమయాల్లో స్కూటర్‌మీద ప్రసాద్ వెనుక కూర్చుని పలకరిస్తున్న చల్లగాలిని కుశలమడుగుతూ రివ్వున దూసుకుపోవడం— పెళ్ళయిన రెండేళ్ళకు తనఒడిలో సందీప్, మరో రెండేళ్ళలో తన ఒడిలో మనోజ్ఞ, సందీప్ స్కూటర్‌ముందు.... ఎంత థ్రిల్లింగ్‌గా, ఎంత సంతోషంగా గడిచిపోయేవి రోజులు!

"మా మామగారుపోయి ఆరేళ్ళయింది. అప్పటినుంచి అత్తగారు మాదగ్గరే వుంటున్నారు. ఆవిడ వచ్చిన దగ్గర్నుంచి మా రొటీన్ మారిపోయింది.... మా ఆడబడుచు పల్లెటూళ్ళో సరిగ్గా చదువబ్బడం లేదని సారథిని యిక్కడకు పంపింది. ముగ్గురు పిల్లలు, ఇంటెడుపని, కాలేజీ... నేను సంతోషంగావుంటే బహుశాయివన్నీ చులాగ్గా చక్కబెట్టుకునే దాన్నేమో!" రేఖ మాటలు వింటూ శ్రుతి ఆలోచిస్తూంది. ఏమిటీ అమ్మాయి సమస్య? ప్రసాద్ సరిగ్గా చూసుకోవడం లేదా?!

"మా అత్తగారికి వీరమడి. అంచేత పని మనుషుల్తో చేయించుకునే క్వశ్చనే లేదు. పెద్ద పనుల్ని పిల్లల కెలాగూ అప్ప జెప్పంకదా! చిన్న చిన్న పనులు, కనీసం వాళ్ళ పనులు వాళ్ళు చేసుకోకపోతే ఎలా చెప్పండి? ఇందాక చూశారుగా మీరు? స్నానంచేసి బట్టలుకూడా తీసుకోదు మనోజ్ఞ. వాడూ అంతే. ప్రతిదీ నేను అమర్చిపెట్టాలి. బూట్లు పాలిష్ చెయ్యడం దగ్గర్నుంచి హోమ్‌వర్క్‌దాకా నేనే చూడాలి. యిదంతా మా అత్తగారి గారాబం ఫలితం. వాళ్ళకేదైనా పనిచెప్తే చాలు, చిన్నపిల్లలు వాళ్ళెందుకు పనులు చేసి కందిపోవాలని వాళ్ళను వెనకేసుకొస్తూ మాట్లాడుతుంది.... చిన్నపిల్లల మనస్తత్వాలు తెల్ల కాగితాల్లాంటివి. ఎవరెక్కువగా ఇన్‌ఫ్లూయన్స్ చెయ్యగలరో వాళ్ళ ప్రభావమే పడుతుంది." తన హృదయంలోని బాధనువిని, అర్థంచేసుకోగల శ్రోత దొరికిందే చాలనుకుని చెప్తోంది రేఖ.

"ప్రసాద్ హెల్ప్ చెయ్యరా?"

"ప్రసాద్ ఆవిడ రాకముందు నావెంట వెంటవుండి అన్నిటికీ హెల్ప్ చేసేవాడు. ఇద్దరం కలిసి చేసుకుంటూంటే పని చేస్తున్నట్లనిపించేదే కాదు. ఇప్పుడు ప్రసాద్ వంటింటి ఛాయలకు వచ్చాడంటే చాలు, చెట్టంత మగాడు ఆడంగి పనులు చేయడమేమిటంటూ మూడో ప్రపంచ యుద్ధం వచ్చినంత హడావిడి చేస్తుందావిడ."

"బావుంది. కనీసం ఆవిడయినా చేస్తుందా పని?" రేఖ ముందే, తన అత్తగారు ఊరికెళ్ళిందని చెప్పడం వల్ల ధైర్యంగా అడిగింది శ్రుతి.

"ఆవిడ చెయ్యడం ప్రసాద్‌కి యిష్టం వుండదు. యింక గొడవెందుకని నేనే చేసుకుంటాను. అసలు పనులు చేసుకోవడం కాదు నా ప్రాబ్లెమ్.... పిల్లలు ఏపనీ రాకుండా, ఏ పనీ చేసే అలవాటులేక సోమర్లుగా, అసమర్థులుగా వుండిపోతారేమోనని నా భయం....తల్లిగా నా పిల్లల మీద నేను పెట్టుకున్న ఆశలువేరు, వ్యక్తిగా నేను కోరుకున్న జీవితం వేరు. నా పిల్లలు యిటు పనిలోనూ, అటు చదువులోనూ, ఇతర కార్యక్రమాల్లోనూ నంబర్‌వన్‌గా వుండాలి. చురుగ్గా, బలంగా, కొండలైనా పిండిచేస్తాం అన్నంత ధీమాగా వుండాలి.. నా భర్త, నేను సన్నిహితంగా కబుర్లు చెప్పుకుంటూ పనులు చేసుకోవడం నాకానందాన్ని కలిగిస్తుంది. నాకంటూ కొంత టైమ్‌ని మిగుల్చుకుని కొత్తరకం బొమ్మలు చేయడం, ఎంబ్రాయిడరీ చెయ్యడం, నచ్చిన పుస్తకాలు చదవడం .... యింకీ అందమైన కల కలగానే మిగిలిపోతుందా అన్న నిస్పృహ.... నా పరిధి కేవలం ఈ చిన్ని కుటుంబం మాత్రమే కాదు. లెక్చరర్‌గా నాకో పవిత్రమైన బాధ్యతుంది. అనుక్షణం అభివృద్ధిచెందుతున్న సైన్సుని ఎప్పటికప్పుడు తెలుసుకుని, క్లాసులో చెప్పవలసింది క్షుణ్ణంగా చదువుకుని, సులభంగా అర్థమయేలా చెప్పడానికి ప్రిపేరవాల్సిన నేను, ఆ అవకాశం లేక, యాంత్రికంగా, మొక్కుబడి తీర్చుకుంటున్నట్లుగా చెప్పేయడం— నా వృత్తికి ద్రోహం చేస్తున్నట్లుగా, నా బాధ్యతను నిర్వర్తించడంలో నేను ఫెయిలవుతున్నట్లుగా.... అసంతృప్తి. ఈ స్థితిని మార్చాలన్న తపన. నేను కోరుకున్న జీవితాన్ని సాధించాలన్న తహతహ. అత్తగారికి గట్టిగా చెప్పలేని అసమర్థత. దారి తప్పుతున్న పిల్లల్ని మార్చలేని అసహాయత. ఈ సంఘర్షణవల్ల ప్రసాద్‌కీ, నాకూమధ్య పలుచని తెర జారుతూందేమోనన్నభయం..." చెప్పుకుపోతూంది రేఖ.

